

దామెరలో నేడు ఫకీర్‌షావలి జాతర

- కులమతాలకతీతంగా తరలిరానున్న భక్తులు

ఎల్కతుర్తి: కులమతాలకతీతంగా హిందువులు, ముస్లింలు కలిసి జరుపుకునే ఫకీర్‌షావలి జాతర బుధవారం మండలంలోని దామెరలో ఘనంగా జరుగనుంది. ప్రతి ఉగాది పండుగ రోజున జరిగే ఈ జాతరకు హిందు ముస్లింలు సైతం అధిక సంఖ్యలో తరలివచ్చి ఫకీర్‌షావలి సమాధిని దర్శించుకుంటారు. గ్రామశివారులోని గుట్టపై వెలసిన ఫకీర్‌షావలి దర్గకు చేరుకోవడానికి తాడు సహాయం అవసరముంటుంది. ఈ గుట్ట దాదాపుగా 200 అడుగుల ఎత్తులో నిటారుగా ఉంటుంది. భక్తులు తాడు సహాయంతో ఫకీర్‌షావలి సమాధిని దర్శించుకుంటారు. ఈ దర్గాను దర్శించుకున్న భక్తులకు ఆయురారోగ్యాలు కలుగడమే కాకుండా సంతానం లేనివారికి సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. ఇక్కడి గ్రామస్తులే కాకుండా సమీపంలో ఉన్న వరంగల్, హన్మకొండ, హసన్‌పర్తి, ధర్మసాగర్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, మండలాల నుంచి వందలాదిగా భక్తులు తరలివచ్చి ముస్లిం జెండాలతో ఫకీర్‌షావలిని దర్శించుకుంటారు. బుధవారం ముజావర్లు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు జరుపనున్నట్లు వెల్లడించారు..

కార్యకర్తలకు అండగా ఉంటా

- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు: కార్యకర్తలకు అండగా ఉంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటానని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలకేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పాదిల రాంమూర్తి, పాదిల సుదర్శన్, కాడబోయిన మొగిలితో పాటు పలువురు హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసగృహంలో మంగళవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు లేతాకుల సంజీవరెడ్డి, బొల్లోజు కుమారస్వామి, వైస్‌ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు పాపని రవీందర్, పాల్గొన్నారు.

పంచాంగం ఆవిష్కరణ

ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శోభకృత్ నామసంవత్సర ఉగాది పంచాంగాన్ని మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కుంకుమేశ్వరస్వామి ఆలయకమిటీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈజీఎస్ ఉద్యోగులకు పే స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

పరామర్శ..

గుడెప్పాడ్ జంక్షన్‌లో రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొని ఇల్లు కూలిపోగా బాధితుడు సుధాకర్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇస్తానని హామీ ఇచ్చారు.

నోటీసులు అందజేత

శాయంపేట : మండల కేంద్రంలో విద్యుత్ బిల్లులు చెల్లించని 25 మంది వినియోగదారులకు మంగళవారం విద్యుత్ శాఖ ఏఈ రాజ్‌కుమార్ రెవెన్యూ రికవరీ నోటీసులు అందజేశారు. విద్యుత్ బిల్లులు పేరుకపోవడంతో ఫారం–ఏ రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద నోటీసులు జారీచేశారు. నోటీసులు తీసుకోవడానికి తిరస్కరించిన వారి ఇళ్ల తలుపులకు నోటీసులను సిబ్బంది అంటించారు. నోటీసులు తీసుకున్న వారు వారంలోపు బిల్లులు చెల్లించకపోతే వారి ఆస్తులను వేలం వేయాల్సి వస్తుందని ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

ఎమ్మెల్యే ఈటల పరామర్శ

కమలాపూర్: మండలంలోని అంబాల, మర్రిపల్లిగూడెం గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చల్లా ధర్మారెడ్డి పరామర్శ

పరకాల: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన వరంగల్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొచ్చు వినయ్‌కుటుంబాన్ని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మంగళవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చిన ఆయన అండగా ఉంటామన్నారు.

ఎల్కతుర్తి: మండల కేంద్రానికి చెందిన బీజేవైఎం కార్యకర్త తంగళ్లపల్లి కార్తీక్, ఎంజాల రామస్వామి ఇటీవలే మరణించగా వారి కటుంబసభ్యులను మాజీ రాష్ట్ర హౌజ్‌ఫెడ్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి మంగళవారం పరామర్శించారు.

లక్ష్యసాధనకు కృషి చేయాలి

దామెర : విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాన్ని చేరే వరకు పట్టుదలతో చదివి విజయతీరాలను చేరుకోవాలని తహసీల్దార్ ఎండీ. రియాజుద్దీన్ అన్నారు. ఊరుగొండలో టెన్త్ విద్యార్థులకు మంగళవారం వైస్ ఎంపీపీ ఎండీ. జాకీర్ అలీ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.

రైతులను ఆదుకోవాలి

పరకాల: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి బిక్షపతి డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఆత్మకూరు: వడగండ్ల వానలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆముదాలపెల్లి మల్లేశంగౌడ్ డిమాండ్ చేశారు. అక్కంపేట, నాగయ్యపల్లె గ్రామాల్లో దెబ్బతిన్నపంటలను పరిశీలించారు.

ధర్మసాగర్(వేలేరు): అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.

ముగిసిన సంత వేలం

ఎల్కతుర్తి: మండల కేంద్రంలో ప్రతీయేటా నిర్వహిస్తున్న వారసంత(మేకలు, గొర్రెలు) వేలం పాట మంగళవారం ముగిసింది. గత ఏడాది రూ.6 లక్షలకు వేలం పాడగా ఈసారి అదనంగా రూ.55 వేలు పెంచి వేలంను దక్కించుకున్నారు. ఈ వేలంలో మొత్తం 62 మంది పాల్గొన్నారు.

అంధత్వ నివారణే లక్ష్యం

ఐనవోలు : అంధత్వ నివారణే లక్ష్యంగా ప్రభుత్వం కంటి వెలుగు పథకాన్ని ప్రవేశపెట్టిందని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మార్నేని మధుమతి, జెడ్పీవైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు అన్నారు. మండలంలోని నర్సింహులగూడెంలో కంటి వెలుగు కార్యక్రమానికి హాజరై వారు ప్రారంభించారు.

బైక్‌ల చోరీ

దామెర: రెండు ద్విచక్రవాహనాలు చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్సై రాజేందర్ కథనం ప్రకారం.. కమలాపూర్ మండలం అంబాలకు చెందిన బోయిన శ్రీనివాస్ ఈనెల 16న ఒగ్లాపూర్‌లోని సైలాని బాబా దర్గ బైక్ పార్కింగ్ చేసి, దర్గాలో దర్శనం చేసుకొని వచ్చి చూసేసరికి కనిపించలేదు. హనుకొండ రెడ్డికాలనీకి చెందిన బయ్యా రవి ఈనెల 13న స్థానిక హోటల్ ముందు బైక్ నిలిపి బయటకుపోయే చూసేసరికి మాయమైంది. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.